క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయం పరిశీలన

మోతె : అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. సోమవారం మోతె మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. విధులకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై దృష్టి సారించాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ విజయ, సిబ్బంది ఉన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గల శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూములను 2025– 26 సంవత్సరానికి గాను కౌలుకు ఇచ్చేందుకు దేవాదాయ శాఖ అధికారులు సోమవారం స్థానిక దేవాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, ఈవో నాగెళ్ల శంభిరెడ్డి మాట్లాడుతూ.. 15 ఎకరాల 30 గుంటల ఆలయ భూములను గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు వేర్వేరుగా రూ.2,69,500కు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఈవో చలపతి పర్యవేక్షణలో జరిగిన ఈ వేలంలో ఆలయ ధర్మకర్తలు వీరారెడ్డి, సైదులు, మల్లేశ్వరి, శివ, అర్చకులు రామకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, గ్రామస్తులు నాగేశ్వరరావు, హుస్సేన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


పూజలో పాల్గొన్న గౌడ కులస్తులు, భక్తులు

చిలుకూరు : మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకంఠమహేశ్వర సురమాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ముగిసాయి. ఆదివారం రాత్రి భక్తులు బోనాలతో ఆలయానికి ప్రదర్శనగా నైవేద్యం సమర్పించారు. సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమయ్య గుడి దగ్గర బలి చల్లుట, జాతర నిర్వహించారు. గౌడ సంఘం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి


కల్మలచెరువులో బీటీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సీతారాంరెడ్డి

గరిడేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 2.80 కోట్లతో కల్మలచెరువు నుంచి గానుగబండ గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మీసాల యోహాన్, సైదిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బచ్చలకూరి కృష్ణప్రసాద్, అమరవరపు ప్రేమ్‌కుమార్, గుండ్ల అనిల్‌రెడ్డి, దాసరి లక్ష్మయ్య, నాగేష్, నరసింహారావు, రాము, రాములు, బొల్లగాని సైదులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మంజీనాయక్, మాజీ సర్పంచ్‌లు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాలో గ్రంథాలయం ఏర్పాటుకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ రూ.2 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం మంజీనాయక్‌తో పాటు స్థానిక మాజీ సర్పంచ్‌లు, పలువురు నాయకులు గ్రామంలో కొనుగోలు చేసిన 2 గుంటల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ భూక్యా రాయసెల్, మాజీ సర్పంచ్‌లు కిషన్‌నాయక్, మీనాసక్రియానాయక్, నాయకులు నవీన్‌నాయక్, భాస్కర్ నాయక్, తులసీరాంనాయక్, బాలునాయక్, శ్రీనునాయక్, జవహర్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మేళ్లచెరువు : మండలంలోని వేపలమాధవరం గ్రామంలో గల గంగమ్మతల్లి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మామిని సత్యనారాయణ కోరారు. వేపలమాధవరంలో గంగమ్మ దేవాలయంలో ధ్వంసమైన విగ్రహాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్ల వెంటే చెత్తాచెదారం

పాలకవీడు : ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేక పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో పాలకవీడు మండలంలోని గ్రామాల్లో చెత్తచెదారం రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో దర్శనమిస్తోంది. చెత్తను డంపింగ్ యార్డులను తరలించే వారే కరువయ్యారు. దీనికి తోడు మండలంలో డ్రెయినేజీల పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. మురుగు కాల్వల్లో పూడిక తీయక మురుగు వీధుల్లో పారి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పాలకవీడు, జాన్‌పహాడ్, దర్గా, కల్మేట్‌తండాల్లో సమస్య తీవ్రంగా ఉంది.


జాన్‌పహాడ్ దర్గా వద్ద రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం


పాలకవీడు గ్రామ శివారులో ఇలా..

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

• కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, వారి ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. సోమవారం కోదాడ మున్సిపాలిటీలో జరిగిన వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆమె పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు, గ్లౌజ్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని అధికారులను ఆదేశించారు. కోదాడ పట్టణంలో రూ.250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

కోదాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 244 మంది లబ్ధిదారులకు 76 లక్షల 30 వేల రూపాయల విలువైన చెక్కులను ఆమె అందజేశారు. కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఏపూరి తిరపతమ్మ, బూత్కూరి వెంకటరెడ్డి, ముస్కు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోదాడ : పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం మాజీ సర్పంచ్ బూర ఆంజనేయులు ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆంజనేయులు కుటుంబాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, భక్తులు

చిలుకూరు : మండల కేంద్రంలోని బేతవోలు రోడ్డులో నిర్మించిన యాదవుల కులదైవం గంగమ్మ తల్లి ఆలయం వద్ద జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ జాతరలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టపాక సత్యనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు, యాదవులు పాల్గొన్నారు.

భూభారతితో భూసమస్యలు పరిష్కారం

• ఆర్డీఓ సూర్యనారాయణ

నడిగూడెం : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి మాట్లాడారు. భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సరిత, ఆర్.ఐ. రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్ అన్నారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సరిత, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


నడిగూడెంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం చింతలపాలెం మండలంలోని వజినేపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన ఆయన మాట్లాడారు. సదస్సులో 85 మంది దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వాసుదేవరావు, ఆత్రేయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

మోతె : సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని, నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని భారత జాతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌చౌహాన్ రైతులకు సూచించారు. సోమవారం మోతె మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో కేవీకే గడ్డిపల్లి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం మోతె మండల వ్యవసాయ అధికారి అరుణ మాట్లాడుతూ పంట మార్పిడి చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడవచ్చన్నారు. వరి, పత్తి, మిర్చి పంటలతో పాటు భూసార పరీక్షలు, జీవ ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చౌహాన్

నేటి నుంచి సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించబోయే సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు, మండల కమిటీ సభ్యులకు రాజకీయ చైతన్యం కలిగించేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.హుస్సేన్, డి.బ్రహ్మం, వి.సైదులు, యోనా, వీరయ్య, మురళి, వీరమల్లు, వీరస్వామి, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు చింతకుంట్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్లలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పట్టణ, మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన రాజేష్‌రెడ్డిని పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు, పార్థనబోయిన విజయ్‌కుమార్, అంబటి నాగేశ్వర్‌రావు, పల్లెపంగు వీరబాబు, విజయ్‌రెడ్డి, పవన్‌కుమార్, రాంరెడ్డి, జగతయ్య, ప్రవీణ్, హిందూజ, బాలునాయక్, సతీష్, సైదులు, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడంపై హర్షం

హుజూర్‌నగర్ : మంత్రివర్గంలో మాల సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుపాటి బాబురావు అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం పట్ల సోమవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో మాల మహానాడు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య, రాష్ట్ర కార్యదర్శులు ఐ.బెంజిమెన్, ఐ.శ్రీనివాస్, జిల్లా కోకన్వీనర్ జి.రాములు, రాష్ట్ర మహిళ కార్యదర్శి సావిత్రి, జిల్లా నాయకులు కె.దయాకర్, డి.పున్నయ్య, మండల నాయకులు కె.రాజా, కె.పుల్లయ్య, కె.కళ్యాణ్, పి.నరసింహారావు, కె.ప్రవీణ్, కె.కమలాకర్, డి.పెంటయ్య, రంజిత్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో బడిబాట


బడిబాటలో పాల్గొన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ముత్యాలవీధి పరిధిలో గల తిలక్ నగర్‌లో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి విద్యార్థుల సర్వే చేసి రికార్డులో నమోదు చేసుకున్నారు. హెచ్‌ఎం రామతారక, ఉపాధ్యాయులు కళావతి, షర్మిల, స్వర్ణలత, అంగన్‌వాడీ సిబ్బంది రజని, రేణుక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన దార నర్సయ్య (50), చింత గోపయ్య (55) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మృతులు నిరుపేద కుటుంబాలకు చెందినవారు. సోమవారం కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్, గ్రామానికి చెందిన గోసుల రాజేష్ మృతుల కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కొత్త ఉపేందర్, పప్పులు ఉపేందర్ పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం

చిలుకూరు : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం చిలుకూరులో జరిగిన బీసీ హక్కుల సాధన సమితి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గంలో ఇంకో రెండు పదవులను బీసీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, గౌరవ అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, కాసాని అంజయ్య, కొండా శివరాం, కట్టెకోల రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, నిర్వాహకులు

మఠంపల్లి : మండలంలోని బక్కలచ్యాతండాలో గల ఆంజనేయస్వామి ఆలయం 4వ వార్షికోత్సవాన్ని సోమవారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదావత్ సక్రునాయక్, పీఏసీఎస్ మండల వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్, నాయకులు రవినాయక్, రాంబాబు నాయక్, కిషన్, శంకర్, వీరన్న, మోహన్, రంగారావు, క్రాంతి, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి

హుజూర్‌నగర్ : బీసీలు సామాజికంగా చైతన్యవంతులు కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దూళిపాల శ్రీనివాస నాయుడు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్‌లో ఎస్‌కే హనీఫ్‌ను బీసీ సంక్షేమ సంఘం 1వ వార్డు అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు గోవిందరావు, మహిళా అధ్యక్షురాలు దీప, నాయకులు నరసింహ, అశోక్, నాగేశ్వరరావు, బ్రహ్మచారి, శ్రీనివాస్, ఇందిరమ్మ, శివ, పాల్గొన్నారు.

కొత్తతండాలో పశువైద్య శిబిరం

మఠంపల్లి : మండలంలోని కొత్తతండాలో నేరేడుచర్లకు చెందిన సంఘం డెయిరీ బ్రాంచ్ సహకారంతో మిల్క్ ఏజెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ వి.సాయితేజ.. పాడి గేదెలకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. తెలంగాణ జోన్ హెడ్ కె.నాగప్రభు, నేరేడుచర్ల బ్రాంచ్ మేనేజర్ కళాశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రామకృష్ణ, బాలసైదులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


అంజయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలో ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆ సంఘం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎస్టీయూ సీనియర్ నాయకుడు దివంగత గండెల అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి అంకిరెడ్డి, సురగాని లింగయ్య, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గుండు ఆదినారాయణ, ఖన్నంసాహెబ్, కొండా ధనమూర్తి, కొండా రామాంజినేయులు, మంద పుల్లయ్య, పుట్టపాక నరసింహారావు, ఎలగొండ శ్రీను, బాలేబోయిన పవన్, గురువారెడ్డి, సురేష్, కృష్ణ, కొండా వెంకటేశ్వర్లు, కస్తూరి విజయ్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002– 2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సేకు వెంకటేశ్వర్లు, సంగమేశ్వరప్రసాద్, రమేష్, కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు నరేష్, వీరబాబు, రఫీ, సీతరామయ్య, రాముడు, మస్తాన్, రజిని, లక్ష్మీకుమారి, రాజశ్రీ, నూర్జహాన్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


గరిడేపల్లి : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


కోదాడరూరల్ : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కోదాడరూరల్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ వీవీ రాంచంద్‌ర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించి ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేయాలని, తాగునీటి నిర్వాహణ, విద్యుత్ దీపాలు, ట్రాక్టర్ డీజిల్ వంటి బిల్లులను ప్రతి నెల విడుదల చేయాలని కోరారు. ఇతర జోన్లలో పని చేస్తున్న కార్యదర్శులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న వారిని జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేసి ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు వెంకటనారాయణ, అరుణ, అవినాష్, కావ్య, నాగలక్ష్మి, వీరబాబు, శ్వేత ఉన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని గరిడేపల్లి మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈమేరకు సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గరిడేపల్లిలో ఎంపీడీఓ సరోజకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల నిర్వహణకు ప్రతి నెల నిధులు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను క్లియర్ చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఊరూరా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

కోదాడరూరల్ : వచ్చే నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఊరూరా ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం కోదాడ పట్టణంలోని వర్తక సంఘం భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎస్పీ అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్‌బాబు, నందిగామ ఆనంద్, గంధం బుచ్చారావు, యలమర్తి రాము, కొండపల్లి ఆంజనేయులు, వడ్డేపల్లి కోటేష్, ఏపూరి సత్యరాజు ఉన్నారు.

స్వచ్ఛందంగా కంపచెట్ల తొలగింపు


జేసీబీతో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు కమ్మేసి మూసుకుపోయింది. దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి తన సొంత ఖర్చుతో కంపచెట్లను తొలగింపజేశారు. దీంతో స్థానికులు ఆయనను అభినందించారు. ఆయన వెంట పలువురు నాయకులు, తదిరులున్నారు.

జీవాల ఎరువుతో భూమికి మేలు

• జీవాల విసర్జకాలతో నేల సారవంతం

హుజూర్‌నగర్‌రూరల్ : భూసార లోపాన్ని అధిగవించేందుకు జీవాల ఎరువులు ఉపయోగపడతాయి. గతంలో పాడిపశువుల ఎరువులను పొలాలకు వాడేవారు. కానీ పశు సంపద తగ్గడంతో పొలాలకు సేంద్రియ ఎరువు వేయక భూసారం తగ్గి దిగుబడులు పడిపోతున్నాయి. దీంతో రైతులు పొలాల్లో జీవాల ఎరువు పెడుతున్నారు. స్థానిక యాదవ కులస్తులకు చెందిన గొర్రెలను పొలాల్లో మేపుతున్నారు. అయితే మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో కురుమ, యాదవులు.. గొర్లకు మేత కోసం గొర్రెలను హుజూర్‌నగర్ మండలానికి తోలుకొచ్చారు. దీంతో గొర్లను ఉదయం వేళ పొలాల్లో మేపడం, మందను రాత్రి అక్కడే ఉంచుతున్నారు. దీంతో వాటి విసర్జకాలతో భూసారం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో భూమి సారవంతం..

జీవాల ఎరువు వ్యవసాయ పొలాలకు ఎన్నో లాభాలను కలిగిస్తాయి. జీవాల యజమానులు వాటిని ఉదయం మేపుతూ రాత్రి సమయాల్లో వాటిని పొలాల్లోనే ఉంచుతున్నారు. ఎరువు కోసం 2000 జీవాలు ఒక రోజు ఉంచితే ఎకరం పొలానికి ఎరువు సరిపోతుందని రైతులు చెబుతున్నారు. ఇందుకు గాను రైతుకు రూ.1500 నుంచి రూ. 2000 వరకు ఖర్చవుతుందని అంటున్నారు. తక్కువ ఖర్చుతో పొలం సారవంతంగా తయారవుతుందని అన్నదాతలు వాటి కోసం పోటీ పడుతున్నారు. పొలంలో గొర్రెలు, మేకల మంద వదిలితే పేడ, మూత్రం, వెంట్రుకల వల్ల భూమికి సేంద్రియ పదార్థం లభిస్తుందని, గొర్రె పేడలో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మొక్కల వేర్లు భూమి లోపలికి సులువుగా వెళ్లి తొందరగా మొక్క ఎదుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అలాగే వాటి మూత్రంలో పీహెచ్ 7.7 ఉండడం వల్ల భూమిలో ఉన్న సొడు కూడా పోయి సారవంతంగా తయారవుతుంది. భూమి గుల్లబారుతుంది. ఒక లీటరు మూత్రంలో 3 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్ఫరస్ ఉంటాయి. గొర్రె లేదా మేక ఒక రాత్రికి లీటరు మూత్రం విసర్జిస్తుంది. ఈ ఎరువు వల్ల భూమిలో తేమశాతం నిల్వ ఉండి తడులు తక్కువగా పడతాయని అంటున్నారు. ఒక్క ఏడాది ఎరువు వేస్తే మూడేళ్ల వరకు ఎరువు అవసరం ఉండదని రైతులు అంటున్నారు.


శ్రీనివాసపురంలోని పొలంలో జీవాల మంద

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి

జీవాల ఎరువు పొలానికి బలాన్ని అందిస్తుంది. ఏటా జీవాల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. దుక్కులు దున్నక ముందే జీవాల ఎరువు వేయించి కలియదున్నాలి. రైతులు పంట దిగుబడి పెంచుకోవాలి.

– రావిరాల స్వర్ణ, ఏఓ, హుజూర్‌నగర్

భూసారం పెరుగుతుంది

జీవాల ఎరువుతో భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల పంట దిగుబడి ఏటా తగ్గుతోంది. దీంతో రెండేళ్లుగా జీవాల ఎరువు వేయిస్తున్నా. పంట దిగుబడి పెరిగింది

– జింకల శ్రీను, రైతు, శ్రీనివాసపురం

జీవాల మేత కోసం వలస వచ్చాం

జీవాలకు మా ప్రాంతంలో వేసవికాలంలో మేత ఉండదు. మేత కోసం జిల్లాలు దాటి ఇక్కడికి వచ్చాం. ఇక్కడ జీవాల ఎరువుకు గిరాకీ ఉండడంతో మేతతో పాటు మాకు ఆదాయం లభిస్తోంది.

– కె.లింగయ్య, గొర్రెల కాపరి, మహబూబ్‌నగర్ జిల్లా